సాక్షి నిర్మల్

శనివారం । 1 । జూన్ । 2024



కళల ఖిల్లా.. నిర్మల్ జిల్లా

నిర్మల్ జిల్లా అనగానే గుర్తుచ్చేది కళలు, కవులు, కళాకారులు. తాజాగా సాహిత్యంతో పాటు షార్ట్ ఫిలింలు, శాస్త్రీయ నృత్యంలోనూ జిల్లావాసులు ప్రతిభ చాటుతున్నారు. 10లో▸

స్కానింగ్ సెంటర్ల తనిఖీ

నిర్మల్‌చైన్‌గేట్‌: నిర్మల్ పట్టణంలో పలు స్కానింగ్ సెంటర్లను డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్ శుక్రవారం తనిఖీ చేశారు. లింగనిర్ధారణ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి బారె రవీందర్ పాల్గొన్నారు

వాతావరణం

గరిష్టం/కనిష్టం
42.4 /31.1

చాలావరకు ఎండగా ఉంటుంది. ఆకాశం అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. ఎడ తీవ్రత అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి



వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్

నిర్మల్‌చైన్‌గేట్‌: పొగాకు ఉత్పత్తులకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని, వాటి వినియోగంతో కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్ అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని బస్తీ దవఖానాలో వైద్య సిబ్బందితో శుక్రవారం ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పొగాకు సేవించడం వలన గుండె, శ్వాసకోశ సంబంధిత వ్యాధులతోపాటు క్యాన్సర్లు వచ్చే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. ఇవి మరణాలకు దారి తీస్తున్నాయన్నారు. పొగాకు వాడకంతో కలిగే ఇబ్బందుల గురించి నష్టాల గురించి ఏర్పడే అనారోగ్య సమస్యల గురించి విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్, డాక్టర్ శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారి వేణురావు, అప్తాల్మిక్ ఆఫీసర్ లక్ష్మీకాంత్, నర్సింగ్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

3న అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

నిర్మల్ రూరల్: తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 3న జిల్లా కేంద్రంలో అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పద్మనాభగౌడ్, శామ్యూల్ తెలిపారు. అండర్–8, 10, 12, 14, 16, 18 ,20 విభాగాల్లో బాలబాలికలు, మహిళలు, పురుషులు పాల్గొనాలని సూచించారు. రన్నింగ్, జంపింగ్, త్రోస్ విభాగాలలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. విజేతలను ఈనెల 6, 7 తేదీల్లో హనుమకొండలోని జయం స్టేడియంలో నిర్వహించే పోటీలకు ఎంపిక చేస్తామని వెల్లడించారు. ఆసక్తి ఉన్నవారు వయసు ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 8 గంటలకు రిపోర్టు చేయాలని సూచించారు. వివరాలకు 9440516634 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

ప్రభుత్వ ఉత్తర్వులు సరికాదు



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయులు

నిర్మల్ రూరల్: రాష్ట్రంలో 6, 7 తరగతుల విద్యార్థులకు భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు గణితం బోధించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం సరికాదని జిల్లాలోని భౌతిక రసాయనశాస్త్ర ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈమేరకు డీఈవో రవీందర్‌రెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందించారు. నారాయణవర్మ, బచ్చు శ్రీనివాస్ మాట్లాడారు. 6 ,7 తరగతులకు గణితం బోధించమని ప్రభుత్వం జీవో 11143 ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో 20 శాతం అదనంగా గణిత ఉపాధ్యాయులు పనిచేస్తున్నా తమకు అదనంగా బాధ్యతలు అప్పగించడం సరికాదన్నారు. ఆర్‌సీ నంబర్ 77 ద్వారా ఇప్పటివరకు తాము 6వ తరగతి విద్యార్థులకు మాత్రమే గణితం బోధిస్తున్నామన్నారు. ఇప్పుడు కొత్తగా వచ్చిన జీవో ద్వారా ఏడో తరగతి విద్యార్థులకు కూడా అదనంగా బోధించాల్సి ఉంటుందన్నారు. దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే జీవో ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చినవారిలో జిల్లా సైన్స్ అధికారి వినోద్‌కుమార్ ఉపాధ్యాయులు కుమార్, పూర్ణచందర్, రాజేశ్వర్‌రెడ్డి, భూషణ్, రఫీక్, రామకృష్ణారావు తదితరులు ఉన్నారు.

కౌంట్‌డౌన్ షురూ



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్, ఎస్పీలు తదితరులు

- ఈ నెల 4న 'పార్లమెంట్' ఓట్ల లెక్కింపు
- ఆదిలాబాద్‌లోనే కౌంటింగ్ ప్రక్రియ
- మూడు కేంద్రాల్లో ముమ్మర ఏర్పాట్లు
- 14 టేబుళ్లు..159 రౌండ్లు
- మధ్యాహ్నం వరకు ఫలితం వెల్లడయ్యే అవకాశం

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు కౌంట్‌డౌన్ షురువైంది. ఇక మూడు రోజులే గడువు ఉండడంతో అందరి దృష్టి కౌంటింగ్‌పైనే కేంద్రీకృతమైంది. బరిలో నిలిచిన అభ్యర్థులు, ప్రధాన రాజకీయ పార్టీల్లో ఫలితాలపై ఉత్కంఠ నెలకొనగా, ఈ ఎన్నికల్లో గెలుపేవరిదనే దానిపై ప్రజల్లోనూ ఆసక్తి కనిపిస్తుంది. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపును ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోనే చేపట్టనున్నారు. జూన్ 4న నిర్వహించనున్న ఈ ప్రక్రియకు యంత్రాంగం ఇప్పటికే అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసింది. మధ్యాహ్నం 3గంటల వరకు తుది ఫలితం వెల్లడయ్యే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

12,21,563 ఓట్ల లెక్కింపు

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి గత నెల 13న నాలుగో విడతలో ఎన్నికలు జరిగాయి. ఏడు నియోజకవర్గాల పరిధిలో 2,200 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 12 మంది అభ్యర్థులు మాత్రమే బరిలో ఉండటంతో ఒక్క ఈవీఎంతోనే పోలింగ్ కొనసాగింది. మొత్తం 16,50,175 మంది ఓటర్లు ఉండగా 12,21,563 మంది మాత్రమే తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 74.03 శాతం పోలింగ్ నమోదైంది. ఒక్కో టేబుల్‌పై 14 ఈవీఎంలను ఉంచి లెక్కింపు ప్రక్రియ చేపట్టనున్నారు. మొత్తం 159 రౌండ్లలో లెక్కింపు కొనసాగనుంది. ఇందుకోసం మూడు జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తూ, పనులను పర్యవేక్షిస్తున్నారు.

కేంద్రాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు

పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాలకు సంబంధించి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోనే మూడు చోట్ల ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించి ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపును టీటీడీసీలో చేపట్టనుండగా, నిర్మల్ జిల్లాకు సంబంధించి ముథోల్, నిర్మల్, ఖానాపూర్ నియోజకవర్గాల ఓట్లను సంజయ్ గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పరిధిలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపును సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో చేపట్టనున్నారు. కౌంటింగ్‌కు సంబంధించి ఆయా కేంద్రాల్లో ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈవీఎంలను ఉంచేందుకు అవసరమైన టేబుళ్లతో పాటు కౌంటింగ్ ప్రక్రియకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అల్యూమినియం తీగలతో కూడిన జాలీలను బిగించారు. నిరంతర నిఘా ఉండేలా సీసీ కెమెరాలు అమర్చారు. ప్రధాన పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు కూర్చునేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. వెలుతురు స్పష్టంగా ఉండేలా ప్రత్యేక హైమాస్ట్ లైట్లను అమర్చారు. వీటితో పాటు ప్రతీ కౌంటింగ్ కేంద్రంలో మీడియా సెంటర్‌ను సైతం ఏర్పాటు చేస్తున్నారు.

10 నిమిషాలకో రౌండ్

ఒక్కో రౌండ్‌కు 10 నుంచి 15నిమిషాల సమయం పట్టనుంది. ఈ లెక్కన గంటకు నాలుగు రౌండ్లు పూర్తవుతాయి. అత్యధికంగా ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 26 రౌండ్లలో కౌంటింగ్ ఉండగా, అత్యల్పంగా ఆదిలాబాద్ నియోజకవర్గంలో 21 రౌండ్లలో ప్రక్రియ పూర్తి కానుంది. ఏడు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు పూర్తయ్యేకే రౌండ్ల వారీగా ఓట్లను పరిశీలించి ఫలితాన్ని ప్రకటించనున్నారు. ఉదయం 8గంటలకు లెక్కింపు ప్రారంభం కానుండగా మధ్యాహ్నం 3గంటలకల్లా తుది ఫలితం వెల్ల డయ్యే అవకాశముంది. అయితే గెలుపొందిన విజేత ఎవరనేది మాత్రం సాయంత్రమే అధికారికంగా ప్రకటించే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా పోలింగ్ కేంద్రాలు, లెక్కించనున్న ఓట్లు, అందుకు అయ్యే రౌండ్ల వివరాలు..

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	లెక్కించే ఓట్లు	రౌండ్లు
సిర్పూర్	320	1,63,944	23
ఆసిఫాబాద్	356	1,71,511	26
బోథ్	306	1,65,157	22
ఆదిలాబాద్	292	1,81,136	21
ఖానాపూర్	309	1,62,101	22
నిర్మల్	306	1,85,168	22
ముథోల్	311	1,92,546	23

లెక్కింపు ప్రక్రియ ఇలా..

కౌంటింగ్ కేంద్రంలో ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. వీటిపై రౌండ్లు, పోలింగ్ కేంద్రాల వారీగా కంట్రోల్ యూనిట్లను తీసుకువచ్చి లెక్కింపు చేపడుతారు. ఒక్కో టేబుల్‌పై ఓ మైక్రో అబ్జర్వర్, కౌంటింగ్ సూపర్‌వైజర్, మరో అసిస్టెంట్ ఉంటారు. టేబుళ్ల సంఖ్య ఆధారంగా కౌంటింగ్ సిబ్బందిని నియమించారు. వీరికి సంబంధించి తొలి విడత ర్యాండమైజేషన్ ఇప్పటికే పూర్తి కాగా శనివారం రెండో విడత చేపట్టనున్నారు. కంట్రోల్ యూనిట్ రిజల్ట్స్ బటన్‌ను నొక్కి అభ్యర్థుల వారీగా వచ్చిన ఓట్లను నమోదు చేస్తారు. చివరగా 17–ఏ ఫాంను పరిశీలించి పోలైన ఓట్లను సరిచూశాక నియోజకవర్గంలోని ఆయా టేబుళ్ల వారీగా అభ్యర్థులకు వచ్చిన ఓట్లను అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారికి తెలియజేస్తారు. ఏఆర్వో ఆ నియోజకవర్గంలో రౌండ్ల వారీగా వచ్చిన ఓట్లుగా పరిగణించి ఎన్నికల సంఘం పోర్టల్‌లో నమోదు చేస్తారు. ఇలా ఏడు నియోజకవర్గాల నుంచి అందిన ఓట్లను కలిపి అభ్యర్థుల వారీగా పార్లమెంట్ నియోజకవర్గ ఓట్లుగా పేర్కొంటూ రౌండ్ వారీగా రిటర్నింగ్ అధికారి మెజార్టీతో కూడిన ఓట్ల వివరాలు వెల్లడిస్తారు.

ఓట్ల లెక్కింపు పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్, ఎస్పీ
- కౌంటింగ్ కేంద్రం పరిశీలన



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్‌చైన్‌గేట్‌: పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపును పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన నిర్మల్, ముథోల్, ఖానాపూర్ అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించి ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల ఎస్పీలు గౌస్ ఆలాం, జానకీ షర్మిల, అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, కిశోర్‌కుమార్‌తో కలిసి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. లెక్కింపు కేంద్రంలో స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాళ్లలో టేబుల్స్, సీసీ కెమెరాలు, మీడియా సెంటర్ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. రౌండ్ల వారీగా ఫలితాలపై అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. రాజకీయ ప్రతినిధులు, కౌంటింగ్ అధికారులు, సిబ్బంది, మీడియా ప్రతినిధులకు తాగునీరు, భోజన సదుపాయం కల్పించాలన్నారు. రౌండ్ల వారీగా ఫలితాలు స్పష్టంగా తెలిపే విధంగా ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో నిర్మల్, ఉట్నూర్ ఆర్డీవోలు రత్నకళ్యాణి, జీవాకర్ అధికారులు పాల్గొన్నారు.

'బడిబాట' విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో గోవింద్

సోన్: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచేందుకు జూన్ 3 నుంచి చేపట్టే బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీ సీఈవో, మండల ప్రత్యేక అధికారి గోవింద్ సూచించారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో బడిబాట కార్యక్రమంపై మండల అధికారులతో ప్రత్యేక సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవింద్ మాట్లాడుతూ జూన్ 3 నుంచి 19 వరకు బడిబాట కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. యూనిఫాంల స్టిచింగ్, అమ్మ ఆదర్శ పాఠశాల పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేశ్, ఎంపీవో ఖలీల్ హైమద్, ఐకేపీ ఏపీఎం గంగామణి, ఏఈ గురునాథం, హెచ్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఆస్తులను పరిరక్షించాలి



సోన్: పంచాయతీ ఆస్తులను పరిరక్షించాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ సూచించారు. మండలంలోని న్యూవెల్మల్ పంచాయతీని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని నర్సరీ, పల్లెప్రకృతి వనం, శ్మశానవాటిక, డంపింగ్ యార్డ్, క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. గ్రామ పంచాయతీ స్థిర, చర ఆస్తుల నిర్వహణ, పరిరక్షణ బాధ్యత గ్రామ పంచాయతీ సిబ్బందిదే అని అన్నారు. రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీవో ఖలీల్ హైమద్, కార్యదర్శి భూపాల్‌రెడ్డి, కారోబార్ మహేశ్వర్, సిబ్బంది ఉన్నారు.

ఇంటర్ తరగతులకు వేళాయె

- నేడు మోగనున్న కాలేజీ గంట
- ఇప్పటికే ప్రారంభమైన ఫస్ట్ ఇయర్ ప్రవేశాలు
- ఉమ్మడి జిల్లాలో 254 జూనియర్ కళాశాలలు సిద్ధం

జిల్లాలో కాలేజీల వివరాలు..

జిల్లాలో ప్రభుత్వ కళాశాలలు	13
ప్రభుత్వ సెక్టార్	30
ప్రైవేట్ కళాశాలలు	20
సెకండ్ ఇయర్ విద్యార్థులు	7,030
అధ్యాపకులు	204



జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాల

నిర్మల్‌ఖిల్లా: జూనియర్ కాలేజీల వేసవి సెలవులు మే 31తో ముగిశాయి. జూన్ 1 నుంచి కాలేజీలు పునఃప్రారంభం కానున్నాయి. వేసవి సెలవుల నేపథ్యంలో రాష్ట్రంలోని అన్నిరకాల జూనియర్ కాలేజీలకు మార్చి 31 నుంచి వేసవి సెలవులు ఇచ్చిన సంగతి తెలిసిందే. సెలవుల తర్వాత ఇంటర్‌లో కొత్తగా చేరిన ప్రథమ సంవత్సరం విద్యార్థులతోపాటు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు జూన్ 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభంకానున్నాయి.

కొనసాగుతున్న ప్రవేశాలు..

ఇంటర్‌లో ప్రవేశాలు కొనసాగుతున్నాయి. మే 9న ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. మే 31 వరకు విద్యార్థుల నుంచి తొలిదశ దరఖాస్తులు స్వీకరించారు. జూన్ 30 నాటికి మొదటి దశ ప్రవేశ ప్రక్రియ పూర్తిచేయనున్నారు. తర్వాత రెండోదశ ప్రవేశాలకు సంబంధించిన షెడ్యూల్ విడుదల కానుంది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యామండలి అకడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 254 జూనియర్ కాలేజీలు ఉండగా, నిర్మల్ జిల్లాలో ప్రభుత్వ ప్రైవేటు గురుకుల సొసైటీ కస్తూర్బా సంస్థలోని ఇంటర్ కాలేజీలు 63 ఉన్నాయి.

అందుబాటులో కోర్సులు..

ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, ప్రైవేట్ కాలేజీలు, టీఎస్ రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్, ట్రైబల్ వెల్ఫేర్, మైనారిటీ, కేజీబీవీ, మోడల్ జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులుతోపాటు ఒకేషనల్ విభాగంలో ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎంఎల్టీ, ఫ్యాషన్ డిజైనింగ్, క్రాఫ్ట్ ప్రొడక్షన్ మేనేజ్మెంట్, అకౌంట్స్ అండ్ టాక్సేషన్ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

స్వాగతం పలుకనున్న సమస్యలు..

ఇంటర్ విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలుకనున్నాయి. జూన్ 1 నుంచి ద్వితీయ సంవత్సరం తరగతులు మాత్రమే ప్రారంభించే అవకాశం ఉంది. వీరికి ఇంకా పాఠ్య పుస్తకాలు రాలేదు. హైదరాబాద్‌లోని తెలుగు అకాడమీ వాటిని ముద్రించి జిల్లాలకు విడతల వారీగా పంపించాల్సి ఉంటుంది. జూలైలో పుస్తకాలు అందించే అవకాశం ఉంది. ఇక కళాశాల భవనాల సమస్యలు అలాగే ఉన్నాయి. కళాశాలలో మౌలిక వసతుల కోసం పలు ప్రతిపాదనలు పంపుతున్న నిధులు మంజూరు కావడం లే దు. అధ్యాపకుల సమస్య వెంటాడుతోంది. 13 మ ంది ప్రిన్సిపాళ్లు ఉండాల్సి ఉండగా కేవలం 9 మందే ఉన్నారు. ఇక 136 మంది రెగ్యులర్ అధ్యాపకులు, 14 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులు ప్రస్తుతం ప ని చేస్తున్నారు. గత విద్యా సంవత్సరం 54 మంది అతిథి అధ్యాపకులు ఉండగా.. వారి రెన్యువల్ విషయంలో ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ప్రభుత్వ ఆదేశాలతో జూలై నెలాఖరు వరకు నియామకాలు చేపడతామని అధికారులు పేర్కొంటున్నారు.

5 నుంచి సప్లిమెంటరీ మూల్యాంకనం..

జిల్లాలో ఈ నెల 5 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభం అవుతుంది. దీనికోసం జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జూన్ 1 నుంచి ప్రారంభం కావాల్సి ఉండగా.. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా అధికారులు 5వ తేదీకి వాయిదా వేశారు. సబ్జెక్టుల అధ్యాపకులు 5వ తేదీ నుంచి పది రోజులు స్పాట్‌లో పాల్గొంటారు.

అనుమతులు ఉన్న కాలేజీలో చేరాలి..




రాష్ట్ర ప్రభుత్వ, ఇంటర్ విద్యాశాఖ ఆదేశాల మేరకు జూన్ 1వ తేదీ నుంచి ఇంటర్ కళాశాలలో తరగతులు ప్రారంభమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆమోదిత ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో విద్యార్థులు ప్రవేశాలు పొందాలి. తమకు నచ్చిన కోర్సుల్లో అడ్మిషన్ పొందవచ్చు. పదో తరగతి పాసైన విద్యార్థులు అందరూ ధ్రువీకరణ పత్రాలతో కళాశాలలో సంప్రదించి అడ్మిషన్ తీసుకోవచ్చు. తెలంగాణ ఇంటర్ బోర్డు గుర్తింపు పొందిన అనుబంధ కళాశాలల వివరాలు వాటి జాబితాను ఇంటర్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ www. tsbie. cgg. gov. in లో అందుబాటులో ఉన్నాయి.

– జాదవ్ పరుశురాం, డీఐఈవో

ఆగిన అభివృద్ధి



నల్దుర్తి తుర్కవాని చెరువు



నిర్మాణంలో ఉన్న టాయిలెట్స్ గదులు

- అటవీప్రాంతాల్లో టూరిజం అభివృద్ధికి నిధులు
- నల్దుర్తి చెరువు సమీపంలో నిర్మాణ పనులు..
- నిధుల కొరతతో మధ్యలోనే నిలిపివేత..



చెరువు సమీపంలో ఏర్పాటు చేసిన ట్రాక్

మామడ: అటవీ ప్రాంతాల్లో టూరిజంను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఆహ్లాదకరంగా ఉండే ప్రాంతంను గుర్తించిన అటవీశాఖ ఎఫ్‌డీసీ(ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) నిధులతో అభివృద్ధి పనులు చేపట్టింది. ఈ క్రమంలో కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలోని మామడ మండలం నల్దుర్తి గ్రామం సమీపంలోని అటవీ ప్రాంతంలో నిజాం కాలంలో వన్యప్రాణుల దాహార్తి తీర్చడంతోపాటు పంటల సాగుకోసం తుర్కవాని చెరువును నిర్మించారు. అడవిలో ఉండే ఈ చెరువులోకి సరస్వతీ కాలువ నీరు చేరడంతో ఏడాదంతా నిండుగా ఉంటుంది.

నిర్మల్‌కు 23 కిలోమీటర్ల దూరంలో..

నిర్మల్ జిల్లా కేంద్రానికి వెల్దుర్తి 23 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఇక్కడి తుర్కవాణి చెరువు కింద గ్రామానికి చెందిన 500 ఎకరాలు సాగవుతుంది. ఇక అడవిలోని జింకలు, సాంబారు, దుప్పులు, నీలుగాయిలు, కుందేళ్లు దాహార్తి తీర్చుకునేందుకు ఇక్కడికి వస్తుంటాయి. దీంతో దీనిని అభివృద్ధి చేయాలని అటవీ అధికారులు ప్రతిపాదనలు పంపించగా నిధులు మంజూరయ్యాయి.

ముందుకు సాగని పనులు..

నల్దుర్తి సమీపంలో తుర్కవాణి చెరువు నుంచి పొన్కల్ సమీపంలోని వెంగన్న చెరువు వరకు ఆంటిలోపు ట్రాక్ నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. పర్యాటకంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఎఫ్‌డీసీ నిధులతో గతేడాది పనులు ప్రారంభించారు. సందర్శకుల కోసం కాటేజీలు, చెరువులో బోటింగ్ సౌకర్యం కల్పించడం, కాలినడక బాటల నిర్మాణం వంటి పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా మొదట టాయిలెట్స్ నిర్మాణం ప్రారంభించారు. మిగతా పనులు మొదలు పెట్టలేదు. నిధుల కొరతతో పనులు నిలిచిపోయినట్లు అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

పనులు చేస్తే పర్యాటక గుర్తింపు..



నల్దుర్తి చెరువును టూరిజం కేంద్రంగా ఎంపిక చేశారు. అభివృద్ధి పనులు ప్రారంభించారు. యేడాది గడుస్తున్నా పనులు ముందుకు సాగడం లేదు. పనులను పూర్తి చేస్తే టూరిజం పరంగా ఈ ప్రాంతానికి గుర్తింపు లభిస్తుంది.

– పదాల శ్రీనివాస్, ఎంపీటీసీ దిమ్మదుర్తి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం

దిమ్మదుర్తి అటవీక్షేత్ర పరిధిలోని నల్దుర్తి చెరువు సమీపంలో ఆంటిలోపు ట్రాక్, టాయిలెట్స్ నిర్మాణ దశలో ఉన్నాయి. మిగతా పనులు మొదులు కాలేదు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పనులు ప్రారంభించేలా చూస్తాం.

– శ్రీనివాస్‌రావు, ఎఫ్ఆర్వో, దిమ్మదుర్తి

'దశాబ్ది'కి వరి కుచ్చులు



నిర్మల్: రాష్ట్ర ప్రభుత్వం జూన్ 2న హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో జిల్లాకు చెందిన ధాన్యపు కుచ్చులు ప్రత్యేకంగా నిలువనున్నాయి. డీఆర్డీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బంది తయారు చేసిన వరికుచ్చులను ఉత్సవాల స్టాళ్లల్లో ప్రత్యేకంగా ప్రదర్శించనున్నారు. సమీకృత పంట భూమిలో డీఆర్డీవో ఆధ్వర్యంలో సాగు చేసిన వరితో తొలిసారి డీఆర్డీవో తయారు చేసిన వరి కుచ్చులను జిల్లా అధికారులతోపాటు ఎన్నికలకు వచ్చిన ప్రత్యేకాధికారులకూ వీటిని అందించారు. ఇదే క్రమంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలకూ వీటిని పంపించాల్సిందిగా రాష్ట్ర అధికారులు సూచించడంతో కలెక్టర్, డీఆర్డీవో వీటిని ప్రత్యేకంగా తయారు చేయించారు. సుమారు వంద వరకు తయారు చేశామని, వీటిని శనివారం హైదరాబాద్ పంపిస్తామని డీఆర్డీవో తెలిపారు.

అభివృద్ధి పనులు పూర్తిచేయాలి

భైంసాటౌన్: అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ ఆదేశించారు. పట్టణంలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను శుక్రవారం పరిశీలించారు. స్థానిక నయాబాదిలో నిర్మిస్తున్న షాదీఖానాతోపాటు, మదీనాకాలనీ, నయాబాదిలోని ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనులను పరిశీలించారు. ఈనెల 5లోగా పనులు పూర్తి చేయాలన్నారు. అలాగే కుంట ప్రాంతంలోని అర్బన్ పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఆయన వెంట మండల ప్రత్యేక అధికారి మోజం హుస్సేన్, పీఆర్ డీఈఈ, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంఈవో సుభాష్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ముగ్గురి రిమాండ్

లోకేశ్వరం: మండలంలోని బిలోలి గ్రామంలో ఈనెల 24 చోటు చేసుకున్న సంఘటనకు సంబంధించి ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 24న గ్రామానికి చెందిన నర్సింగ్‌రావు, శ్రీనివాస్‌రావు, భోజన్న, రాజేశ్వర్‌పై అదే గ్రామానికి చెందిన పలువురితో వాగ్వాదం చోటు చేసుకుంది. ఈక్రమంలో ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో నర్సింగ్‌రావు, శ్రీనివాస్‌రావు, భోజన్న, రాజేశ్వర్‌కు గాయాలయ్యాయి. పరస్పర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దాడికి పాల్పడిన సాకలి శంకర్, సురేశ్, లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఏడు క్వింటాళ్ల నువ్వులు చోరీ



కల్లం వద్ద ఖాళీ నువ్వుల కట్టలు

సోన్: మండలంలోని కడ్తాల్ గ్రామంలో నువ్వు పంట చోరీకి గురైంది. బాధిత రైతు తెలిపిన వివరాలు.. కడ్తాల్‌కు చెందిన రైతు పుట్టకొక్కుల ప్రశాంత్ తన ఎకరం వ్యవసాయభూమిలో నువ్వు సాగు చేశాడు. ఐదు రోజుల క్రితం పంటకోసి ఎండబెట్టాడు. గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎండిన నువ్వులను దులుపుకొని ఎత్తుకెళ్లారు. శుక్రవారం వ్యవసాయ క్షేత్రానికి వెళ్లిన ప్రశాంత్ పంట చోరీకి గురైనట్లు గుర్తించాడు. సుమారు రూ.90 వేల విలువైన ఏడు క్వింటాళ్ల నువ్వులు చోరీకి గురైనట్లు తెలిపాడు.

వడదెబ్బతో యువకుడి మృతి

ఉట్నూర్‌రూరల్: మండలంలోని నాగోబాగూడకు చెందిన ఆత్రం మాన్కుబాయి, భుజంగ్‌రావు దంపతుల ఒక్కగానొక్క సంతానమైన ఆత్రం లింబారావు (23) చికిత్స పొందుతూ మృతి చెందాడు. బుధవారం పంట చేనుకు వెళ్లి వచ్చి రాత్రివేళ వాంతులు, విరేచనాలు చేసుకున్నాడు. వెంటనే అతడిని ఉట్నూర్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు రెఫర్ చేశారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి వైద్యులు హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. లింబారావు హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

వివాహిత అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని రైల్వే క్వార్టర్స్‌కు చెందిన ఓ వివాహిత అదృశ్యమైంది. గురువారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి రాత్రి వరకు తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు బంధువులు, చుట్టపక్కల గాలించినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఎస్సై లాల్‌సింగ్ నాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ఆదిలాబాద్ టౌన్: రిమ్స్‌లో మరో ఆత్మహత్యాయత్నం ఘటన కలకలం కలిగిస్తోంది. ఇటీవలే పేషెంట్ కేర్ సిబ్బంది ఒకరు ఆత్మహత్యకు యత్నించిన ఘటన తెలిసిందే. కాగా, రిమ్స్‌లోని నర్సింగ్ కళాశాలలో తృతీయ సంవత్సరం అభ్యసిస్తున్న విద్యార్థిని ఒకరు గురువారం రాత్రి హాస్టల్‌లో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించినట్లు తెలుస్తోంది. ఆమెకు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ప్రాక్టికల్ పరీక్షల్లో నర్సింగ్ అధ్యాపకులు తనను ఉద్దేశపూర్వకంగా ఫెయిల్ చేయగా మనస్తాపంతోనే ఆత్మహత్యకు యత్నించానని ఆమె పోలీసుల ఎదుట తెలిపినట్లు సమాచారం. కాగా, ఈ విషయాన్ని బయటకు పొక్కకుండా రిమ్స్ వర్గాలు జాగ్రత్తపడ్డాయి. సదరు విద్యార్థినికి ప్రాణాపాయం తప్పినప్పటికీ మూడురోజుల పాటు అబ్జర్వేషన్‌లో ఉంచినట్లు తెలుస్తోంది.

కళల ఖిల్లా.. నిర్మల్ జిల్లా



ఇండియన్ ఎక్సలెన్స్ నాట్యపురస్కారాలు పొందిన నిర్మల్‌బృందం

- అభిరుచితో రాణిస్తున్న కళాకారులు
- జిల్లా పేరును ఇనుమడింపజేస్తూ..
- పలు పురస్కారాలు, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రశంసలు, గుర్తింపు
- సాహిత్యం, నాట్యం, నటన, షార్ట్‌ఫిలిం, పద్యసాహిత్యంలో అవార్డులు

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా అనగానే మొట్టమొదట గుర్తుచ్చేది కళలు, కవులు, కళాకారులు, సాహితీవేత్తలు.. జిల్లా చరిత్రలో మొదటి నుంచి సాహితీ సౌరభాలు విరబూస్తున్నాయి. అయితే ఇటీవల సాహిత్యంతో పాటు సామాజిక మాధ్యమాల్లో షార్ట్ ఫిలింలు, శాస్త్రీయ నృత్యం లాంటి రంగాల్లో కూడా జిల్లావాసులు ప్రతిభ చాటుతున్నారు. వివిధ రంగాలు, వృత్తుల్లో ఊపిరి సలపని బిజీతో ఉన్నప్పటికీ అభిరుచి పరంగా తమకు నచ్చిన ప్రవృత్తుల్లో రాణిస్తూ పలువురు ప్రశంసలు అందుకుంటున్నారు. పలు పురస్కారాలు, ప్రముఖుల ప్రశంసలు పొందుతూ జిల్లాపేరు ప్రఖ్యాతులను ఇనుమడింపజేస్తున్న పలువురిపై 'సాక్షి' అందిస్తున్న కథనం.

పద్యకవికి పట్టాభిషేకం



సన్మానం పొందుతున్న వెంకట్

జిల్లాకేంద్రానికి చెందిన పద్యకవికి అంతర్జాతీయ శతాధిక పద్యకవుల సమ్మేళనంలో పురస్కారం దక్కింది. అంతర్జాతీయ సాహితీ, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ అయిన శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరులో ఇటీవల 134వ అంతర్జాతీయ శతాధిక పద్యకవుల సమ్మేళనం నిర్వహించారు. జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ పద్యకవి, సంస్కృత భాష ప్రచార సమితి ఉమ్మడి జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలంగాణ రచయితల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బీ వెంకట్ పద్యకవిగా పట్టాభిషేకం చేపట్టి, 'అంతర్జాతీయ సమ్మేళన పురస్కారం' అందించారు. సంస్థ అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, సమన్వయకర్త కే రమావతి, జాతీయ మహిళా అధ్యక్షురాలు చిట్టెం లలిత తదితరులు పాల్గొని వెంకట్‌ను స్వర్ణకంకణం, ప్రశంసాపత్రం, శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.

సంప్రదాయ నృత్యంలో చిన్నారులు



నాట్యకౌస్తభ పురస్కారాలతో నిర్మల్‌కు చెందిన చిన్నారులు

జిల్లా కేంద్రానికి చెందిన పదేళ్లలోపు చిన్నారులు ఇటీవల రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో 'ఇండియన్ డ్యాన్స్ ఫెస్టివల్' అనే కార్యక్రమంలో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చారు. ఇందులో వీరికి 'ఇండియన్ ఎక్సలెన్స్' ప్రత్యేక నాట్య పురస్కారం లభించింది. జిల్లా కేంద్రానికి చెందిన వెన్నెల డ్యాన్స్ అకాడమీ డ్యాన్స్ మాస్టర్ ధనరాజ్ ఆధ్వర్యంలో నాట్యంలో ఈ బాలలు శిక్షణ పొందారు. అలాగే ఇటీవల ప్రముఖ వాగ్గేయకారుడు అన్నమాచార్య 616వ జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌లో భారతి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నృత్యహేళ అనే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో జిల్లాకు చెందిన దాదాపు 27 మంది చిన్నారులు ప్రదర్శించిన నృత్యం ఆహూతులను ఆకట్టుకుంది. జిల్లాకు చెందిన చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనకు గాను వీరందరికీ 'నాటయ్కౌస్తభ' అనే పురస్కారాలు వరించడం విశేషం.

దర్శకత్వంలో మేటి.. ఈ మేరీమాత



ఉత్తమ షార్ట్‌ఫిలిం డైరెక్టర్ పురస్కారం స్వీకరిస్తున్న మేరీమాత

జిల్లా కేంద్రంలోని శాంతినగర్ కాలనీకి చెందిన చిత్తూరు మేరీమాత వృత్తిరీత్యా వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఉద్యోగం చేస్తున్నారు. కాగా, ఈమెకు తొలినుంచి లఘుచిత్రాల నిర్మాణంలో, దర్శకత్వ బాధ్యతల్లో మంచి అభిరుచి ఉంది. ఆమె సామాజిక ఇతివృత్తాలను తీసుకుని లఘుచిత్రాలు తెరకెక్కిస్తోంది. అయితే ఆమె ఇటీవల ట్రాన్స్‌జెండర్ జీవనంపై షార్ట్‌ఫిలిం నిర్మించారు. ఇందులో ట్రాన్స్‌జెండర్స్ నిత్యజీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ తెరకెక్కించిన విధానం యూట్యూబ్ మాధ్యమంలో వేలాదిమంది వీక్షకులకు చేరువైంది. అలాగే నటనలోనూ వీరు ప్రతిభ కనబరుస్తున్నారు. ఈమె ఇటీవల నిర్మించిన 'శ్రీకారం' అనే లఘుచిత్రానికి రాష్ట్రస్థాయిలో మెగా ఎంటర్‌ప్రైజెస్ అనే సంస్థ అందించిన నంది పురస్కారాలలో 'బెస్ట్ షార్ట్ ఫిలిం డైరెక్టర్'గా అవార్డు అందుకున్నారు. కొంతకాలంగా యూట్యూబ్ మాధ్యమంలో ఎంఎం క్రియేషన్స్ అనే ఛానల్‌ను ప్రారంభించి చిత్రాలు విడుదల చేస్తున్నారు. వీటి ద్వారా ఇప్పటికే షీ టీం, శ్రీకారం, వీకెండ్ ఎక్స్ఛేంజ్ అనే లఘుచిత్రాలను నిర్మించి విడుదల చేశారు. జిల్లా కేంద్రానికి చెందిన పోలీస్‌శాఖ విధుల గురించి వీరు నిర్మించిన 'షీ టీం' అనే లఘుచిత్రం కూడా ఉత్తమ షార్ట్‌ఫిలింగా ఎంపికైంది. ఈమె దర్శకత్వ బాధ్యతల్లో ప్రస్తుతం' ఓల్డ్ ఏజ్ హోమ్, అనే డాక్యుమెంటరీ చిత్రం కూడా నిర్మాణంలో ఉంది. సమాజానికి సందేశాలనిచ్చేలా లఘుచిత్రాలను నిర్మించడమే తమ ముఖ్య ధ్యేయమని వీరంటున్నారు.

తండ్రి, కూతురుకు రాష్ట్రస్థాయి పురస్కారాలు



ఐకాన్, నందిపురస్కారాలతో వేణుగోపాలకృష్ణ, సుహాసిని

జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ వైద్యుడు వేణుగోపాలకృష్ణ, ఆయన కూతురు సుహాసిని కళలపై ఉన్న అభిరుచితో షార్ట్ ఫిలింలలో నటిస్తూ ఆకట్టుకుంటున్నారు. గోపాలకృష్ణ వృత్తిపరంగా వైద్యునిగా ఎంతో బిజీగా ఉన్నప్పటికీ నటనపై ఉన్న అభిరుచితో లఘుచిత్రాల్లో నటిస్తూ, నిర్మాణంలోనూ పాలుపంచుకుంటున్నారు. ఇక తన కూతురు సుహాసిని వైద్యవిద్యనభ్యసిస్తుండగా ఆమె కూడా నటనతో పాటు భరతనాట్యం, కూచిపూడి నాట్య విభాగాల్లో రాణిస్తోంది. ఇటీవల హైదరాబాద్‌లోని మెగా ఎంటర్‌ప్రైజెస్ సంస్థ వారు ఐకాన్ పురస్కారాలు అందించారు. కాగా, ఇందులో డాక్టర్ వేణుగోపాలకృష్ణ ఆయన కూతురు సుహాసిని ఐకాన్, నంది పురస్కారాలు అందుకున్నారు. వేణుగోపాలకృష్ణ 'ప్రేమతో నాన్న', 'మహారాజు', 'ఆవేదన' లాంటి లఘుచిత్రాల్లో ప్రదర్శించిన నటనకు ఉత్తమ నటుడిగా పురస్కారం అందుకున్నారు. 'ప్రేమతో నాన్న' అనే లఘుచిత్రంలో నటించిన సుహాసిని ఉత్తమ నటిగా ఐకాన్ అవార్డు దక్కించుకున్నారు. వేణుగోపాలకృష్ణ అనేకసార్లు ఉత్తమ వైద్యునిగా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లోనూ పురస్కారాలు పొందారు. తాజాగా తండ్రి కూతుళ్లిద్దరూ పురస్కారాలు పొందడాన్ని పలువురు ప్రశంసిస్తున్నారు.

మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా

ఉట్నూర్‌రూరల్: ఆశ్రమ పాఠశాలల్లో ఏర్పడ్డ మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేసి పాఠశాలల పునఃప్రారంభానికి సిద్ధం చేయాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉట్నూర్ కేబీ ప్రాంగణంలోని పీఎంఆర్సీ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సంక్షేమాధికారులు, ఏటీడీవోలు, ఏసీఎంవోలు, జీసీడీవోలు, క్రీడల అధికారులు, పీఎంఆర్సీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మరమ్మతులకు అవసరమైన కనీస మొత్తాన్ని అందజేస్తామన్నారు. విద్యార్థులకు తాగునీరు, స్నానపు గదులు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం తదితర సూక్ష్మ మరమ్మతులు చేయాలని సూచించారు. ఏటీడీవోలు, ప్రత్యేక అధికారులు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పనులు జరిగేలా చూడాలని ఆదేశించారు. బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, రోజువారీ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న విద్యార్థులంతా ప్రాథమిక పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థులందరినీ జూనియర్ కళాశాలల్లో చేర్పించేలా చూడాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులదేనన్నారు. పీవీటీజీ విద్యార్థులను హయత్‌నగర్ ప్రభుత్వ ప్రతిభ కళాశాలల్లో చేర్పించాలని సూచించారు. నాణ్యమైన సరుకులను ఆశ్రమ పాఠశాలలకు సరఫరా చేయాలని జీసీసీ అధికారులను ఆదేశించారు. పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, రికార్డుల్లో పొందుపర్చాలని కోరారు. సమావేశంలో ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్, రమాదేవి, గంగారాం, ఈఈ రాథోడ్ భీంరావు, జీసీసీ డీఎం రమానందం, అదనపు డీఎంహెచ్‌వో రామారావు, ఎస్‌డీసీ గంగాధర్, ఏసీఎంవోలు జగన్, ఉద్ధవ్, రాజమౌళి, శివాజీ, క్రీడల అధికారులు పార్థసారథి, మీనారెడ్డి, జీసీడీవోలు ఛాయ, శకుంతల, జీవరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీలో అడ్మిషన్ల కోసం..

- నేటి నుంచే దరఖాస్తుల స్వీకరణ
- అధికారిక వెబ్‌సైట్‌లో పూర్తి సమాచారం
- ఎస్సెస్సీ బోర్డు సర్వర్‌తో అనుసంధానం
- ఈ విద్యాసంవత్సరంలో 1,500 సీట్లు



భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో 2024–25 విద్యాసంవత్సరానికి శనివారం నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ ఏడాది ఆన్‌లైన్‌లో దరఖాస్తు విధానాన్ని ఎస్సెస్సీ బోర్డు సర్వర్‌తో అనుసంధానం చేశారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థి హాల్‌టికెట్ నంబర్, పేరు తదితర వివరాలు ఆటోమేటిక్‌గా ప్రత్యక్షమవుతాయి. జూన్ 1నుంచి 22 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు.

ఈ ఏడాది 1,500 సీట్లు..

బాసర ట్రిపుల్‌ఐటీలో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ కోర్సుల్లో ప్రవేశాల నోటిఫికేషన్ విడుదలైంది. జూన్ 1నుంచి 22వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ట్రిపుల్‌ఐటీ వీసీ, ప్రొఫెసర్ వెంకటరమణ తెలిపారు. ఈ ఏడాది 1,500 సీట్లు భర్తీ చేయనున్నారు. పదో తరగతిలో విద్యార్థులు సాధించిన జీపీఏ ఆధారంగా సీట్లు భర్తీచేస్తారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.450, ఓసీ, బీసీ విద్యార్థులు రూ.500 దరఖాస్తు ఫీజు చెల్లించాలని వీసీ వెంకటరమణ తెలిపారు. వివరాల కోసం www.rgukt.ac.in లేదా 7416305245, 7416058245, 7416929245 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆన్‌లైన్ సెంటర్లలో..

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు మీ సేవా కేంద్రాలు, ఆన్‌లైన్ సెంటర్లలో దరఖాస్తు చేసుకోవచ్చు. వెబ్‌సైట్ తెరవగానే నమోదు చేయాల్సిన వివరాలు స్క్రీన్‌పై కనిపిస్తాయి. జీపీఏ ఆధారంగా ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను చూసి అడ్మిషన్ కమిటీ సీట్లు కేటాయించనుంది. వేల సంఖ్యలోనే ట్రిపుల్‌ఐటీకి దరఖాస్తులు వస్తున్నాయి. ఇందులో కేటగిరీల వారీగా సీట్లు భర్తీచేస్తారు. విద్యార్థుల జీపీఏ, సామాజికవర్గం, ఇతర వివరాలు తెలుసుకుని సీట్లు కేటాయిస్తారు. ఇతర ఏ వివరాలున్నా కళాశాలలో సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు. బాసర ట్రిపుల్‌ఐటీలో గ్రామీణ విద్యార్థులకే ఎక్కువ సంఖ్యలో సీట్లు దక్కుతున్నాయి. మొదటి రెండేళ్లు ఇంటర్ తత్సమాన పీయూసీ కోర్సు బోధిస్తారు. పీయూసీలో వచ్చిన మెరిట్ ఆధారంగా ఇంజినీరింగ్ సీట్లు కేటాయిస్తారు. నాలుగేళ్ల బీటెక్‌లో సివిల్, కెమికల్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్ ఐటీ, ఈసీఈఎంఎంఈ కోర్సులు అందిస్తున్నారు. సీట్లు దక్కించుకుని ప్రవేశం పొందిన విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. చదువుకునే సమయంలో ల్యాప్‌టాప్, దుస్తులు, విద్యాసామగ్రి ఇస్తున్నారు. హాస్టల్, భోజన వసతి యూనివర్సిటీయే కల్పిస్తోంది.

షెడ్యూల్ ఇలా..

- ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ జూన్ 1నుంచి 22 వరకు
- స్పెషల్ కేటగిరీ విద్యార్థులు డౌన్‌లోడ్ చేసిన దరఖాస్తులను సమర్పించేందుకు గడువు జూన్ 29
- ప్రొవిజన్ సీట్ల కేటాయింపు (స్పెషల్ కేటగిరీ కాకుండా) జూలై 3
- సర్టిఫికెట్ వెరిఫికేషన్ జూలై 8

బైక్‌ల చోరీకి పాల్పడిన నలుగురి రిమాండ్



మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

బేల: ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడిన నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆయన ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బేల ఎస్సై రాధిక, పోలీస్ సిబ్బందితో కలిసి శుక్రవారం ఉదయం కుమురంభీం చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. జైనథ్‌కు చెందిన కొంగల ఉమేశ్, బేలకు చెందిన పాత్రాజ్ శేఖర్, అస్లాంఖాన్‌తో పాటు మండలంలోని కాంగార్‌పూర్‌కు చెందిన గావుండే జ్ఞానేశ్వర్ మూడు ద్విచక్ర వాహనాలపై వెళ్తున్నారు. వారు వాహనపత్రాలు చూపించలేదు. అనుమానం వచ్చి వారిని విచారించగా, హైదరాబాద్‌లో ఆ వాహనాలను పలుచోట్ల చోరీ చేసినట్లు ఒప్పుకొన్నారు. వీరు హైదరాబాద్‌లో రెండేళ్లుగా క్యాబ్ డ్రైవర్లుగా పనిచేశారు. జల్సాలకు అలవాటు పడి డబ్బు కోసం ఈ చోరీలు చేశారు. ఈ మూడువాహనాలతో పాటు మరో 11వాహనాలను ఆయా ప్రాంతాల్లో చోరీ చేసినట్లు గుర్తించి, స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ పేర్కొన్నారు. ఈ వాహనాల విలువ రూ.14లక్షల వరకు ఉంటుందని తెలిపారు. దీంతో వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. జైనథ్ సర్కిల్ సీఐ సాయినాథ్, ఏఎస్సై గణపతి, కానిస్టేబుల్‌లు ప్రభాకర్, దామోదర్, సలీం తదితరులున్నారు.

పెళ్లైన నెలన్నరకే వివాహిత మృతి



సువర్ణ (ఫైల్)

తాంసి: పెళ్లయి నెలన్నర కూడా పూర్తికాకముందే అనారోగ్యంతో వివాహిత మృతిచెందిన ఘటన భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామంలో చోటుచేసుకుంది. మండలంలోని కరంజి(టి) గ్రామానికి చెందిన గోల్లి సువర్ణ (25)ను పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన అరవింద్‌కు ఇచ్చి గత ఏప్రిల్ 12న వివాహం చేశారు. నాలుగు రోజులుగా జ్వరం రావడంతో సువర్ణ అనారోగ్యం బారిన పడింది. దీంతో ఆమెను జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్పారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం ఆస్పత్రిలో మృతిచెందింది. కాగా, సువర్ణ మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. పిప్పల్‌కోటిలో అంత్యక్రియలు అడ్డుకున్నారు. కాగా, గ్రామస్తులు జోక్యం చేసుకుని అంత్యక్రియలు పూర్తిచేయించారు.

సబ్సిడీపై సోయా విత్తనాలు అందించాలి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్: రైతులకు 50శాతం సబ్సిడీపై సోయా విత్తనాలు అందించాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రిని శుక్రవారం కలిసి వినతిపత్రంఅందించారు. ఖరీఫ్ సమీపిస్తున్న నేపథ్యంలో ఆదిలాబాద్ జిల్లాలో ఎంతో డిమాండ్ ఉన్న పత్తి విత్తనాల కొరత తీర్చాలని కోరారు. రాశి 659 రకం పత్తి విత్తనాలకు డిమాండ్ ఉన్నందున వెంటనే ఆలస్యం చేయకుండా రైతులందరికీ పంపిణీ చేయాలన్నారు. రాష్ట్రంలోనే సోయాబీన్ సాగు విస్తీర్ణం ఆదిలాబాద్ జిల్లాలోనే ఎక్కువగా ఉందని తెలిపారు. అలాగే వ్యవసాయ యాంత్రీకరణ కింద వ్యవసాయ పనిముట్లు, స్ప్రింక్లర్లు, స్ప్రేలు సబ్సిడీపై అందించాలని విన్నవించారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించి అధికారులతో ఖరీఫ్ సాగుపై చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎదులాపురం: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 10న నిర్వహించనున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంక రాఘవులు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో శుక్రవారం సదస్సుకు సంబంధించిన కరపత్రం ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. 'గ్రామీణ ఉపాధిహామీ చట్టం అమలు–సవాళ్లు' అనే అంశంపై ఈ నెల 10న ఉదయం 10.30 గంటలకు సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. సదస్సుకు పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క, జాతీయ నాయకులు వెంకట్, శివదాసన్, నాగయ్య, వెంకట్రాములు ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని పేర్కొన్నారు. సంఘం నాయకులు, కార్యకర్తలు, ఉపాధి కార్మికులు, అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు ఎస్.స్వామి, సహాయ కార్యదర్శి ఆశన్న, ఉపాధ్యక్షురాలు అట్ల పొచ్చక్క, మంజుల పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేందుకే విత్తన రాజకీయం



విత్తన డీలర్లతో మాట్లాడుతున్న అన్వేశ్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేందుకే ప్రతిపక్షాలు విత్తన రాజకీయం చేస్తున్నాయని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేశ్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పలు విత్తన దుకాణాలకు వెళ్లి డీలర్లతో మాట్లాడారు. అంతకుముందు జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్యను కలిసి వివరాలు తెలుసుకున్నారు. రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలని, అవసరమైన విత్తనాలు తెప్పించేందుకు చొరవ చూపాలని కోరారు. రైతులు ఒకే రకం విత్తనాలను కోరడంతోనే ఇలాంటి పరిస్థితి ఎదురవుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విత్తన కొరతను తీర్చేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతోందన్నారు. డీలర్లు బ్లాక్ మార్కెట్‌కు విత్తనాలు తరలిస్తే కఠిన చర్యలు చేపట్టాలన్నారు. ఒకే రకం విత్తనాలు కాకుండా వేర్వేరు విత్తనాలు వాడడంతోనే దిగుబడి వస్తుందని శాస్త్రీయంగా నిరూపితమైందన్నారు. రైతులు అపోహలకు గురికావద్దని సూచించారు. విత్తనాల విషయంలో ప్రతిపక్షాలు అనవసర రాజకీయాలు చేస్తున్నాయని, రైతులను రెచ్చగొట్టే విధంగా చూస్తున్నాయని ఆరోపించారు. ఇటీవల ఆదిలాబాద్ పట్టణంలో లాఠీచార్జి జరిగిందన్నది అవాస్తవమని, తమది రైతుపక్షపాతి ప్రభుత్వమని తెలిపారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా రైతులను నయవంచనకు గురిచేసిందని ఆరోపించారు. ఆయన వెంట కిసాన్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గంగాధర్, సంతోష్, వెంకట్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, చరణ్‌గౌడ్, సామ రూపేశ్‌రెడ్డి తదితరులున్నారు.